క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని ట్రిపుల్ ఐటీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఉషాబాలా నగర్, మైలవరం రోడ్డు, గాంధీనగర్, రెడ్డిగూడెం రోడ్డు, గొడుగువారిగూడెం, నందనం తోట, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, యానాదుల కాలనీలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

10న హుండీ కానుకల లెక్కింపు

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 10వ తేదీన లెక్కిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు పర్యవేక్షిస్తారని చెప్పారు.

దివ్యాంగుల సర్వేలో లక్ష్యాలు సాధించాలి

ఇబ్రహీంపట్నం: భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు దివ్యాంగుల సర్వేలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. మండల పరిధిలో జరుగుతున్న దివ్యాంగుల సర్వే వివరాలను ఎంపీడీఓ ఉమాదేవి, ఎంఈఓ సీహెచ్ పుష్పలతకు శుక్రవారం వివరించారు. దివ్యాంగ బాలలు ప్రభుత్వ విద్యా శిక్షణ, ఫిజియో థెరపీ వంటి సేవలను వినియోగించుకునేందుకు సర్వే ఉపయోగపడుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 9న సర్వే గడువు ముగుస్తున్నందున త్వరగా పూర్తి చేయాలన్నారు. సహిత ఉపాధ్యాయులు ఉషారాణి, చంద్రావతి, ఆశాలు పాల్గొన్నారు.

మంచి విత్తనంతోనే అధిక దిగుబడులు

కేవీకే కో–ఆర్డినేటర్ కృష్ణంరాజు

జగ్గయ్యపేట : నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ ఎం.కృష్ణంరాజు పేర్కొన్నారు. విత్తన ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పేట నియోజకవర్గ పరిధిలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట పరిధిలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో 6వేల ఎకరాలకు పైగా వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. నూరు శాతం కాలువలు, బోర్లు ద్వారానే అధికంగా సాగవుతోంది. ఖరీఫ్‌లో ముఖ్యంగా బీపీటీ 5204, ఎంసీఎం103, ఎంటీయూ1061 వంటి రకం సాగులో ఉన్నాయి. ఆయా భూములు, వాతావరణ పరిస్థితులను అనుసరించి రైతులు విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కృష్ణంరాజు సూచించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజామునుంచే భక్తులు పాలు,పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి భక్తుల సౌజన్యంతో ప్రత్యేకంగా మల్లెలతో అలంకరించారు.

14 నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ విమాన గోపుర సంప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలను అవ్వారి ఉమా శంకర దీక్షిత శర్మ పర్యవేక్షణలో వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 14వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపన, ప్రధాన దేవతామూర్తి అనుష్టానం, పారాయణ, హోమాలు నిర్వహిస్తారు. 10 గంటలకు శాంతి కల్యాణోత్సవం, సాయంత్రం శారదా నృత్య పీఠంచే నృత్య ప్రదర్శన జరుగుతుంది. 15వ తేదీ ప్రధాన దేవతామూర్తి అనుష్టానం, పారాయణ, హోమాలు, విమాన గోపురం దేవతా మూర్తుల సంప్రోక్షణ, శాంతి కల్యాణం జరుగుతుంది. 16వ తేదీ ఉదయం శాంతి కల్యాణం, మహా పూర్ణాహుతి, వేద పండితుల ఆశీర్వచనం జరుగుతుంది. సాయంత్రం ప్రధాన దేవతా మూర్తులచే నగరోత్సవం నిర్వహించనున్నారు.

పుస్తక పఠనంతో భాషపై పట్టు



తిరువూరు గ్రంథాలయంలో బహుమతులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు



పెనుగొలను గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

- ముగిసిన వేసవి శిక్షణ తరగతులు
- విద్యార్థులు పలు అంశాల్లో పట్టు సాధించారని వక్తల వెల్లడి
- విజేతలకు బహుమతుల ప్రదానం

తిరువూరు: భాషపై పట్టు సాధనకు పుస్తక పఠనం ఎంతగానో దోహదం చేస్తుందని, విద్యార్థులు బహు భాషల్లో ప్రావీణ్యత సంపాదించాలని తెలుగు భాషా వికాస సమితి కన్వీనర్ తోట ఉమా మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం తిరువూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత వ్యయప్రయాసలకోర్చి నిర్వహిస్తున్న గ్రంథాలయాల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటా వేసవిలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థను అభినందించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని భరత కుమారి, సాయిబాబా ట్రస్ట్ సభ్యురాలు సీత, గ్రంథాలయాధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని మైలవరం శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జడ్.నాగిరెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఎందరో యువకులు గ్రంథాలయాల సేవలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్నారని చెప్పారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ప్రస్తుతం గ్రంథాలయాల్లో ఇంటర్‌నెట్‌తో పాటు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రంథాలయంలో ఇప్పటివరకు వివిధ అంశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోయ సుధ, టి. సురేష్‌బాబు, టి. సాంబశివరావు, విద్యార్థులు, పాఠకులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఈమని శేషయ్య మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం మరింత పెంపొందించామన్నారు. ప్రతి రోజూ కథలు, విజ్ఞాన పుస్తకాలను విద్యార్థులతో చదివించడంతో పాటు క్యారమ్స్, చెస్ ఆటలను నేర్పించామని చెప్పారు. ఇలాంటి విజ్ఞాన శిబిరాల నిర్వహణ వల్ల విద్యార్థుల వేసవి సెలవులు సద్వినియోగమయ్యాయన్నారు. విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. గ్రంథాలయాధికారి బి.శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

- చాట్రాయి: గ్రంథాలయ సంస్థ నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి ఎంతగానో దోహదపడిందని చనుబండ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ శిబిరాల ద్వారా వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎంతో పరిజ్ఞానాన్ని పొందారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చనుబండ గ్రంథాలయాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.
- గంపలగూడెం: మండలంలోని పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను రిటైర్డ్ ఎంఈఓ శేషిరెడ్డి అందజేశారు. శిక్షణకు హాజరైన విద్యార్థులందరికీ జిల్లా గ్రంథాలయ సంస్థ జారీచేసిన సర్టిఫికెట్లను షిర్డీ సాయి సేవా కమిటీ సభ్యుడు నారాయణరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ. వెంకట నరసింహారావు, గ్రంథాలయ నిర్వాహకులు శ్రీలత అందజేశారు.





నూజివీడు గ్రంథాలయంలో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన గ్రంథాలయాధికారి ; మైలవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాగిరెడ్డి

సీఎస్‌కు శుభాకాంక్షలు





జేసీ సంపత్ కుమార్; స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన్ను ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నీరబ్ కుమార్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు అభినందన

తిరువూరు: కొత్తగా ఎన్నికైన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును శుక్రవారం పలువురు అధికారులు, ఉద్యోగులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు కలిశారు. స్థానిక దారా టౌన్‌షిప్‌లోని ఆయన నివాసంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఎమ్మెల్యేని కలిసి ఎన్నికల్లో గెలుపొందినందుకు అభినందనలు తెలిపారు. అంగన్‌వాడీ తిరువూరు ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు కూడా ఎమ్మెల్యే శ్రీనివాసరావును కలిసి అభినందించారు. అందరికీ అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

మూగజీవాలపై ప్రేమ, కరుణ చూపాలి

ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవులతో పాటు మూగజీవాలైన జంతువులపై కూడా ప్రేమాభిమానాలు, కరుణ చూపాలని ఆధ్యాత్మిక, సామాజికవేత్త, లయన్స్ జిల్లా అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో హజరత్తయ్య గుప్తా, ఐ.నాగేశ్వరరావు భవానీపురంలోని జీవకారుణ్య సంస్థలోని మూగజీవులకు బియ్యం బస్తాలు, కుక్కలు తినే బిస్కెట్ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ మూగజీవులపట్ల కరుణతో కూడిన జీవితం గడపటం ద్వారానే భగవంతుని కృపాకటాక్షాలను పొందటం సాధ్యమవుతుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు కె. రామలింగేశ్వరరావు, కోశాధికారి కె. రామకృష్ణ, కొత్తమాసు రాంకుమార్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మురాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసంపూర్తిగా జాతీయ రహదారి విస్తరణ పనులు

- రామచంద్రాపురం వద్ద నిలిచిన రోడ్డు నిర్మాణం
- నాలుగు లైన్ల రహదారికి అనుమతులు పెండింగ్
- ప్రమాదాలకు నెలవుగా జాతీయ రహదారి



ఎ. కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద నిలిచిపోయిన జాతీయ రహదారి నిర్మాణం

తిరువూరు: కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ 2014లో చేపట్టిన ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారి (గతంలో నెం.221) పనులు ఇంతవరకు పూర్తికాలేదు. మైలవరం–తిరువూరు నడుమ రామచంద్రాపురం రెవెన్యూ పరిధిలో రోడ్డు విస్తరణపై అధికారులకు, గ్రామస్తులకు మధ్య సయోధ్య లేక 108 మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో గ్రామ పరిధిలో పనులు నిలిపివేశారు. 100 మందికి నష్టపరిహారాన్ని మంజూరు చేయగా.. ఇంకా 8 మంది సమస్య పరిష్కరించాల్సి ఉంది. గ్రామ పరిధిలో మూడు దేవాలయాలకు కూడా మంజూరైన పరిహారం సరిపోదని తీసుకునేందుకు నిరాకరించారు. రహదారి నిర్మాణం జరగకపోవడంతో రామచంద్రాపురం వద్ద వాహనాలు నిలువెత్తు గోతుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వర్షాకాలంలో గోతుల్లో నీరు నిలిచి వాహనాల రాకపోకల సమయంలో పాదచారులపై మురుగునీరు, వర్షం నీరు వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30 నంబర్ రహదారిగా మార్పు..

గతంలో ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారి నం.221 గా ఉండగా, దీనిని విజయవాడ–రాంచీ 30 నంబర్ రహదారిగా మార్పు చేశారు. ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ మీదుగా రాంచీ వరకు 1285 కిలోమీటర్ల నిడివి ఈ జాతీయ రహదారి ఉంది. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించడంతో పాటు ప్రమాదాలకు నెలవుగా ఉన్న మలుపుల్లో సూచిక బోర్డుల ఏర్పాటు, వేగ నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తిరువూరులో ప్రమాదాలకు నెలవుగా ఉన్న జాతీయ రహదారి

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ ఆరేపల్లి శిరీష



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ శిరీష

నూజివీడు: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు లేకుండా ప్రజాప్రతినిధులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. దీనిలో భాగంగా వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు డబ్బులు చెల్లించి తీసుకోవచ్చని చెప్పారు. అన్నవరంలో నెల రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ దువ్వూరి వెంకయ్య అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈఓ–1 ఎం.సేవియా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు మండలానికి వచ్చేశాయని, వాటిని పాఠశాలలు తెరిచే రోజు నుంచి విద్యార్థులకు అందజేస్తామన్నారు. బోర్వంచ సర్పంచి కుంటం ఉదయరాజు మాట్లాడుతూ గ్రామంలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు మంచినీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లోని పలు రక్షిత మంచినీటి ట్యాంక్‌ల మెట్లు శిథిలయ్యాయని, దీంతో ట్యాంక్‌లను శుభ్రం చేయడానికి వీలుపడటం లేదన్నారు. వెంటనే మెట్లు నిర్మించాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ డి. స్వర్ణలత, సీడీపీఓ ఎస్‌వై నూరానీ, హెచ్ఎం ఆర్ హేమ, ఈఓపీఆర్డీ సరస్వతి, ఏపీఓ సోమేశ్వరి, ఏపీఎం దయాల రాజశేఖర్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దివ్యాంగుల గుర్తింపు సర్వే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు చేపట్టిన సర్వే ముమ్మరంగా సాగుతోందని సెంట్రల్ మండల విద్యాశాఖాధికారి డి.సాంబశివరావు అన్నారు. మండల పరిధిలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డి.సాంబశివరావు మాట్లాడుతూ 21 వైకల్యాలలో ఏ వైకల్యం కలిగిన వారినైనా, సున్నా నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉండి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చేర్పించడం జరుగుతుందన్నారు. వారిని పాఠశాలల్లో చేర్పించి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తామన్నారు. అంతేకాకుండా వారికి కావలసిన ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. వారికి ట్రావెలింగ్, ఎస్కార్ట్ అలవెన్స్, స్టయిఫండ్, రీడర్ అలవెన్సులు అందజేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు మండల స్థాయిలో 30 మంది పిల్లలను గుర్తించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐ.ఇ.ఆర్.టి కె.వెంకటసుధ, జె.కుమార్ మధు తదితరులు పాల్గొన్నారు.



సర్వే తనిఖీ చేస్తున్న సెంట్రల్ ఎంఈఓ డి.సాంబశివరావు

ఉత్తర మండల పరిధిలో...

విజయవాడ ఉత్తర మండల పరిసర ప్రాంతాల్లో సహిత విద్యా ఉపాధ్యాయులు విజయ, పాప సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న సహాయాన్ని తల్లిదండ్రులకు వివరించామన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను తప్పక పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. రాయితీలు పొందాలని సూచించారు.



ఉత్తర మండల పరిధిలో సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

21 మంది దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వం మే 1 నుంచి జూన్ 9 వరకూ నిర్వహిస్తున్న దివ్యాంగుల నమోదు కార్యక్రమం విజయవాడ తూర్పు మండలంలో శరవేగంగా సాగుతోంది. సర్వేలో భాగంగా భవిత కేంద్రం ఉపాధ్యాయులు పి.కెజియా, వి.విశితలు సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు సందర్శించి ఇప్పటి వరకూ 21 మంది దివ్యాంగులను గుర్తించినట్లు ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. ఉమామహేశ్వరరావు తెలిపారు. సర్వేలో గుర్తించిన దివ్యాంగులను భవిత కేంద్రాల్లో చేర్పించి వారికి ఎస్కార్ట్ అలవెన్స్, బాలికల అలవెన్స్, ఫిజియోథెరపీ వంటి సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వేలో జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని జక్కంపూడి కాలనీలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించగా, రాష్ట్ర సీనియర్ ఏంటమాలజిస్ట్ పి. కొండారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా డీఎంఓ మోతిబాబు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడంతో పాటు ఇంటి పరిసరాల్లో పనికి రాని సామగ్రిలో వర్షం నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు కల్వర్టు వద్ద దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాలీలో అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు


మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీఅంకమ్మ తల్లి శక్తిపీఠంలో అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పరస్పర దాడుల్లో 13 మందిపై కేసుల నమోదు

ముసునూరు: పరస్పరం దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ పి.వాసు తెలిపారు. మండలంలోని రమణక్కపేటలో పాత కక్షల నేపథ్యంలో గురువారం రాత్రి ఉప్పే శివనాగాంజనేయులు మరికొందరు, ఉప్పే పిచ్చియ్య తదితరులు పరస్పరం కర్రలు, కత్తులతో దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల వారికి గాయాలు కావడంతో బాధితులను పోలీసులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఇరువర్గాల వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారంతో శుక్రవారం రాత్రి హెడ్ కానిస్టేబుల్ శివనాగేంద్రరావు ఇరువర్గాలకు చెందిన 13 మందిపై కేసులు నమోదు చేశారు.

అల్గారిథమ్స్‌పై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కంప్యూటర్స్ రంగ విద్యార్థులు అల్గారిథమ్స్‌పై పట్టు సాధించినప్పుడు మంచి అవకాశాలను పొందుతారని కృష్ణా విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం. బాబురెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్ ఆఫ్ ఎఫిషియంట్ అల్గారిథమ్స్' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ ఎం. బాబురెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్స్ విభాగంలో అల్గారిథమ్స్ చాలా ముఖ్యమైన అంశమన్నారు. కంప్యూటర్స్‌లో పట్టు సాధించాలంటే అల్గారిథమ్స్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ అంశంపై లోతైన విశ్లేషణ చేయగలిగినప్పుడు ఈ రంగంలో మంచి పట్టును సాధించగలరన్నారు. ముఖ్యంగా కంప్యూటర్స్ రంగ విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిపై పట్టు సాధించాలని సూచించారు. ఈ విధమైన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం. వెంకటేశ్వరరావు, విభాగాధిపతి పి. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బాబురెడ్డి